# పాపకోసం

రచన:
శ్రీ చిల్లా సత్యనారాయణ రెడ్డి

"పాపా" అని కలవరిస్తున్న జానకి వేపు జాలిగా చూశాడు రామం.

పాప పేరు వినగానే అతని అంతరాంతరాల్లో సంచలనం కలిగింది. పాప తమ ప్రాణాలకి ప్రాణంగా అల్లారు ముద్దుగా పెంచబడింది. ఒక్కక్షణం వుండలేమని తెలిసీ కూడ వుండవలసి వచ్చింది మరి యిప్పుడు. ఏం చేస్తాం మరి. విధి అంతే! అనుకున్నాడు బాధగా. కాని అంతలోనే చప్పున మరిచి పోలేకుండా వున్నాడు.

పాపని సంభంధించిన జ్ఞాపకాలు అతన్ని పదేపదే అలరిస్తున్నాయి.

ఆ రోజు అతను కేంపుకు వెళ్తుంటే తను కూడా వస్తానని పాప వెంటబడింది. వద్దంటే ఎంత చెప్పినా వినలేదు. మారాం చేస్తూ కూర్చుంటే; తప్పించుకుని వెళ్ళడం మహాకష్టమయి పోయింది.

చివరికి వదిలి వెళ్ళినందుకు యీ విధంగా యిలా జరిగింది. అయ్యో! యిలా బరుగుతుందని తెలియదే! యిలా అవుతుందని తెలిస్తే వెళ్ళకే పోదునే! యిలా కంటికి రెప్పలా యిన్నాళ్లూ పెంచుకుంటూ వచ్చిన పాపని యిలా విధికి బలి చెయ్యడమే అయిపోయింది అతని మనసు.

ఏమీ చెయ్యలేని నిస్సహాయత మనసుని వూరడిస్తోంది.

మంచం మీద నిద్ర పోతున్న జానకి వేపు బాధగా చూస్తూ వుండి పోయాడతను.

ఏడ్చి ఏడ్చి నిద్ర పోయిన జానకి ముఖంలో మాతృవేదన ముద్ర వేసినట్లు కనిపిస్తోంది.

హృదయవిదారకయిన సంఘటన తలచుకుంటే గుండె చెఱువవుతోంది.

ఆ రోజు—

పాప పుట్టిన రోజు.

♦ ♦ ♦

పెందలకడనే లేచి పాపకి తలంటి స్నానం చెయ్యింది జానకి.

తనే స్వయంగా తలదువ్వి ముఖానికి పౌడరు పూసి కళ్ళకు కాటుక దిద్ది నుదుట రవ్వంత తిలకం దిద్ది క్రొత్త గౌను పాపకి నచ్చినది తొడిగి, మెడలోని లాకేట్ కేసి పాప ముచ్చటగా చూసుకుంటూ వుంటే, ఎత్తుకుని దేవుని పటం ముందర నుంచోని, "యిలానే మా పాప ఏటేటా మంచిగా పుట్టిన రోజులు జరుపుకుంటూ మాయిల్లు నవ్వులు కేరింతలతో నింపి వెలుగు వెన్నెలలు ప్రకాశింప జెయ్యి తండ్రీ" అని ప్రార్ధించిందామె.

అప్రయత్నంగా తన చిట్టి చేతులెత్తి పాప కూడా ప్రార్థించింది.

కరుణామయుడయిన భగవంతుని చిద్విలాసంతో సంతృప్తి పడిన జానకి; పాపకి టిఫిన్ తినిపించి తాను వంట పనిలోని నిమగ్నమయింది.

బొమ్మల పుస్తకాలన్నీ బొత్తుగా పేర్చుకుని, కూర్చున్న పాప పేజీలు తిరగేస్తూ వింతగా వాటిని చూస్తూ కొంతకాలం యధేచ్ఛగా గడిపేసింది. ఎక్కువసేపు కూచోవటం విసుగనిపించిందో ఏమో తల్లి దగ్గరకు వచ్చి ముభావంగా కూర్చుంది.

బుద్ధిగా కూర్చున్న పాప వంక చూడకుండానే "ఏం పాపా" ఆడుకుంటావా? అంది తల్లి.

తలూపింది పాప.

అనడమే తడవుగా పొరుగింటి పిల్లలని చూపించి "అందాకా ఆడుకోమ్మేం మళ్ళా బువ్వ తిందుగాని";...అని చెప్పి పనిలో నిమగ్న అయింది జానకి.

పాప తన ప్రపంచంలోకి తను వెళ్ళి పోయ్యింది. పొయ్యిదగ్గర కూర్చుందన్న మాటే గాని జానకి ఆలోచనలన్నీ పాప మీదే వున్నాయి.

"యీరోజే ఆయనుంటే ఎంత ముచ్చట పడేవారో! పాపం! వదల్లేక వదిలి మరీ వెళ్ళారు. ఆఫీసు పని వెళ్ళక తప్పుతుందా. సాయంత్రానికయినా వస్తారోరారో! వస్తే సినిమా కయినా వెళ్ళవచ్చును". అనుకుంటూ పనులు చకచకా చెయ్యసాగిందామె.

త్వరత్వరగా వంట పని ముగించుకుని, స్నానం చేసి వచ్చి తలుపు తీసి వరండాలోకి వచ్చి నిల్చుంది జానకి.

అప్పటికి పంది గంటల పైగా అవుతుంది.

శీతకాలపు లేయెండ పల్చగా భూమిమీద పడుతోంది. శీత గాలి శరీరానికి చల్లగా తగులుతోంది,

యింటిముందు ముచ్చటగా మెరుస్తున్న క్రోటన్సు మొక్కలు, పూలతో విచ్చుకున్న చెట్లూ చక్కగా వున్నాయి. యింటి చుట్టూ కాంపౌండ్ వాల్; యింటికి ముందు యినప గేటు, దారి ప్రక్కన పిల్లలు యిసికలో కూర్చుని కేరింతాలు కొడుతూ ఆడుతున్నారు

పాపని పిలుద్దామని ముందుకు వస్తున్న జానకి పొరుగావిడ పిలిచిన పిలుపుతో పక్కకి తిరిగి చూసి ఒకడుగు వెనక్కి వేసింది. ఫెన్సింగ్ లోంచి పైకి వచ్చిన ఆమెతో సర్దాగా మాట్లాడుతూ కనిపించింది సరోజ. ప్రక్క ప్రక్క వాటాల్లో వుంటున్న వారంతా కలిసి కట్టుగా వుంటారు. ఆడవాళ్లు ముఖ్యంగా! మగవాళ్లు ఆఫీసులకి వెళ్లాక వంటపనులయిపోయాక, ఒకరూ ఒకరూ వచ్చి చేరుతారు. వుబుసుపోకకు ఏవో కబుర్లు ముచ్చట్లూ చెప్పుకుంటూ భోజనాల వేళకు మళ్లా యిళ్ళకు నిష్క్రమిస్తారు.

సరిగ్గా యీరోజూ అదే జరిగింది.

కబుర్లలో పడితే కాలం మరిచిపోవడం నిజమని తెలుసుకున్న జానకి, వీధిలో ఆడుకుంటున్న పాపని రమ్మని కేకేసింది.

యింత అన్నం పెడితే మంచిదని!

పాపకి ఆ పిలుపు వినిపించలేదనే అనుకోవాలి. గాలిపటం ఎగరేస్తున్న కుర్రవాడివంక గాలిపటం వంకా వింతగా చూస్తూ తెల్లబోయిన పాప క్షణంలో తేరుకుని గాలిపటం పట్టీలు కొట్టడంతో కేరింతలు నింపుకుని, చప్పట్లు కొడుతూ ఎగిరి గంతేసింది.

సరిగ్గా అదేసమయంలో వాళ్ళమ్మ కేకేసింది.

పాప వినిపించుకోకపోయేసరికి మళ్లా పిలిచింది జానకి.

యీసారి పాప యిటు చూసింది.

అటు గాలిపటంకేసి చూసింది.

కడుతూ కడుతూ సగంలో వదిలేసిన యిసిక గూడు అక్కడే కూడిపోయింది అసంతృప్తిగా! ఎగురుతున్న గాలిపటం పాప మనసులా ముచ్చటగా పూరిస్తోంది రమ్మని.

అయినా అమ్మ పిలిచిన పిలుపుతో వున్న మార్దవం మనసుని వెళ్ళమని హెచ్చరిస్తోంది. పాప అటూ యిటూ ఆలోచిస్తూ వుండిపోయింది. సందిగ్ధంగా 'రావే అన్నం తిందువు గాని అంది' అమ్మ.

చివరికి వెళ్ళడానికే నిశ్చయించుకుంది పాప.

పరుగు లంకించుకుంది ఒక్క క్షణంలో.

రోడ్డువేపు పరికిస్తున్న జానకి కంగారు పడింది అంతలోనే.

శరవేగంతో పరుగెడుతున్న జీపు కారుని ఆపుజెయ్యడానికి సడన్‌గా బ్రేక్ వేశాడు డ్రైవరు. బ్రేకులు వేశాడన్నమాటేగాని అతనికి ఆత్రుతయిపోయింది. సడన్‌గా రోడ్డుని క్రాస్ చేస్తూ వస్తున్న పాపని కాపాడటానికి ప్రయత్నించాడు పాపం! చివరివరకూ.

కాని, పాప అప్పటికే రోడ్డు మధ్యకి వచ్చేసింది.

అప్పులోంచి డౌనులోకి వస్తున్న కారు సడన్‌గా ఆపడంతో ఒక్క కుదుపుతో ముందుకి ఘోర్సుగా జరిగి ఆగింది.

కెవ్వున కేక వినిపించిందంతలోనే!

జీపు చక్రాల క్రింద నిర్దాక్షిణ్యంగా నలిపి వేయబడ్డ పాపను చూసి తెలివితప్పి పడిపోయింది తల్లి. రక్షించాలని ప్రయత్నమయితే చేసింది కాని వశంకాలేదామెకు. బంపరు గట్టిగా గుద్దుకోవటంచేత నుదురు చిట్లి వెంటనే స్పృహతప్పి పడిపోయింది.

పాపం!

జీపుముందు రెండడుగుల మేరకు రక్తం చిమ్మున ప్రవహించింది.

దుర్భర వేదనతో పాప అసువులు బాసింది. కట్టుకున్న క్రొత్త గౌను మాయనయినా లేదు. దువ్వుకున్న జుట్టు చెరగనయినా లేదు. రక్తపు మడుగులో మాంసపు ముద్దలా పుట్టిన రోజు వేడుకనాడు పాప అంతరించింది.

చుట్టూ చేరినవారు, జీపులోంచి దిగినవారూ పాపం అంతా గుమిగూడి విచారించారు. కాని ఏం లాభం కన్నతల్లి శోకాన్ని ఎవరాపగలిగాగు. తెలిసి వచ్చాక జానకి ఠొర్లి ఠొర్లి ఏడ్చింది.

కళ్ళు పుళ్ళుపడేలా ఏడ్చింది

పాపం! పెంచిన మమత అటువంటింది.

ఎందరు వూరడించితేమాత్రం ఏంలాభం?

ఎవరు తీసుకురాగలరు చనిపోయిన పాపని.

అంత్యక్రియలు జరిగిపోయాయి.

కబురు తెలిసిన తండ్రి పరుగెత్తుకవచ్చాడు కానేం లాభం?

ఆ విచారంతో జానకి మంచమెక్కింది.

వైద్యాలోస్తున్నారు. మందులిస్తున్నారు.

మానసికమయిన బాధని మరపింపలేకపోతునారు.

ఏడుస్తుంది. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోతుంది. నిద్రాదేవి ఒడిలోనే ఆమెకి ప్రశాంతత. ఆ చల్లని తల్లి సాన్నిధ్యంలోనే ఆమెకి విశ్రాంతి మరి.

రామానికి అన్నీ తెలుసు. కాని ఆమెని ఓదార్చడమే తెలియదు.

మూగ బాధని అనుభవించడమే నేర్చుకున్నాడు.

అతనంటాడు 'పాప ఎక్కడో లేదు. మనలోనే - మనతోనే వుందంటాడు.'

ఆమె నీళ్ళు నిండిన కళ్ళతో చూస్తుంది.

ధృవతారలో వెలుగుతుందంటాడు పాప.

ఆశగా ఆకాశం వెంపు చూస్తుంది జానకి.

తల్లిప్రేమ అలాంటిది మరి!